ప్రమాదకరంగా మూలమలుపులు

- కనీసం ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం
- పట్టించుకోని అధికారులు



పిట్లం మండలం రాంపూర్ సమీపంలో ప్రమాద సూచిక బోర్డులు లేని మూల మలుపు

పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెల్‌చెరువు గ్రామ సమీపంలోని పిట్లం–బాన్సువాడ, పిట్లం–తిమ్మనగర్, పిట్లం–గోద్మెగాం, పిట్లం–అల్లాపూర్ ఆర్ అండ్ బీ రహదారుల వద్ద ప్రమాదకరంగా మూలమలుపులు ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూలమలుపుల వద్ద సూచికలు లేక పోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని మండల ప్రజలు చెబుతున్నారు. మద్దెల్ చెరువు మూలమలుపు వద్ద గతంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనగా లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన జరిగినా అధికారులు మాత్రం ఆ స్థలంలో నేటి వరకు ప్రమాద సూచికల బోర్డులను ఏర్పాటు చేయలేదు. కుర్తి గేట్ మూలమలుపు వద్ద సూచికల బోర్డు లేకపోవడంతో గతంలో ఆర్టీసీ బస్సు–ఆటో ఢీకొని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పలు ద్విచక్ర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



పిట్లం మండలం సిద్ధాపూర్ చెరువు పక్కన..



కుర్తి గేట్ సమీపంలో..

త్వరగా ఏర్పాటు చేయాలి



రోడ్డు ప్రమాదాలు జరుగకుండా మూల మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పిట్లం – బాన్సువాడ రహదారిలో ప్రతి రోజు వందల వాహనాలు తిరుగుతాయి. ఈ రహదారిపై అనేక మూల మలుపులు ఉన్నాయి. ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడంతో మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి బోర్డులను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– కుమ్మరి యాదగిరి, పిట్లం

కేసీఆర్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రవీందర్ రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సీఎం కేసీఆర్‌ను ఇక ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం అమర్లబండలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం దళిత బంధు పథకాన్ని ప్రారంభించి మమ అనిపించారని అన్నా రు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ గద్దె దిగడం ఖాయ మన్నారు. ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ స మయంలో చాకలి ఐలమ్మను ఎంతో గొప్పగా పొగి డి ప్రస్తుతం మరిచిపోయారన్నారు. ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, రజక సంఘం మండలాధ్యక్షుడు తిమ్మజాడ రాజన్న, మర్కల్ సర్పంచ్ జూకంటి సంగారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘బీటీ రోడ్లుగా మారుస్తున్నాం’

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రధాన వీధులన్నింటిని బీటీ రోడ్లుగా మారుస్తున్నట్లు సర్పంచ్ తున్కి వేణు తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచన మేరకు బీటీ రోడ్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. రోడ్లను నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ బోడ నరేశ్, నాయకులు సరస్వతి, ప్రభాకర్‌లు ఉన్నారు.



భిక్కనూరులో రోడ్డును పరిశీలిస్తున్న నేతలు

ఆరు కిలోల తరుగు తీస్తేనే అన్‌లోడ్ చేస్తున్నారు

- అధికారులు పట్టించుకోవడం లేదు
- బిచ్కుంద సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్ పటేల్

బిచ్కుంద(జుక్కల్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా అధికారుల నుంచి స్పందన లేకుండా పోయిందని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ అశోక్ పటేల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారుల తీరుపై వారు ఆగ్రహం వ్యకం చేశారు. ధాన్యం లారీలతో వెళ్లిన తర్వాత మిల్లర్లు క్వింటాలుకు 6 కిలోలు తరుగు తీస్తేనే లారీలు అన్‌లోడ్ చేయండి లేకుంటే వెళ్లిపోవాలని వేధింపులకు గురి చేస్తున్నా, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని దడ్గి, సీతారాంపల్లితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, బిచ్కుంద ఎంపీటీసీ సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారుల నుంచి పొంతనలేని సమాధానం రావడంతో ఎంపీపీ స్పందించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ పైపులు శాంతాపూర్ దగ్గర వారానికి ఒకసారి పగిలిపోతున్నాయి.. నెలలో 15 రోజులు మాత్రమే నీళ్ల వస్తున్నాయని, రెండు, మూడు గ్రామాలకు సరఫరా ఆగిపోయిందని సీతారాంపల్లి సర్పంచ్, ఎంపీటీసీ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇరిగేషన్ సమస్యలపై సమాధానమిచ్చేందుకు వారు సమావేశానికి గైర్హాజరయ్యారు. అలాగే వివిధ సమస్యలు సభ దృష్టికి వచ్చాయి. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, ఎంపీడీవో ఆనంద్, ఆయా శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్పీకర్, మంత్రికి ఘనస్వాగతం

కామారెడ్డి క్రైం : స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం కామారెడ్డికి విచ్చేశారు. వారికి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జిల్లా అధికారులు మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం వారు క్యాసంపల్లిలో జరిగిన రెడ్డి సంఘ భవన భూమిపూజకు తరలి వెళ్లారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటలో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ ప్రముఖ నాయకులు, ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తల్లి శాంతమ్మ(95) అంత్యక్రియలలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. అనారోగ్యం కారణంగా శాంతమ్మ మంగళవారం సాయంత్రం మతిచెందింది. విషయం తెలుసుకున్న ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు మెదక్ ఎమ్మెల్సీ షేరీ సుభాష్ రెడ్డి గ్రామానికి చేరుకొని శాంతమ్మకు నివాళులర్పించారు. దీంతోపాటు ఆమె కుమారుడు ప్రతాప్ రెడ్డిని పరామర్శించారు. కాగా అంత్యక్రియలో భాగంగా ఎమ్మెల్యే సురేందర్ శాంతమ్మ పాడెను మోసారు.

యూత్ డిక్లరేషన్ క్విజ్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ రూరల్: రాజీవ్‌గాంధీ యూత్ డిక్లరేషన్ క్విజ్ కార్యక్రమంలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు, బాన్సువాడ మున్సిపల్ కౌన్సిలర్ కాసుల రోహిత్ కోరారు. బుధవారం ఆయన ఇబ్రాహింపేట్‌లో పర్యటించారు. 16నుండి 35 ఏళ్లలోపు యువతీ, యువకులు ఈనెల 17వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.18న ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్‌ఖేత్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉద్దర హన్మాండ్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంత్రి గణేష్, గ్రామ అధ్యక్షులు విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ వేసవి శిబిరం



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన చిన్నారులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. నెల రోజుల పాటు వివిధ క్రీడల్లో చిన్నారులకు శిక్షణ ఇచ్చినట్టు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్ కుమార్‌లు తెలిపారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో కాకతీయ పాఠశాల ప్రతినిధి రాంరెడ్డి, ఆర్‌కే కళాశాల డీన్ నవీన్‌లు శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కోచ్‌లు మహేష్, నరేష్ పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న విండో చైర్మన్ సదాశివరెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు భూసారాన్ని కాపాడుకోవాలని విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి సూచించారు. బుధవారం అడ్లూర్‌ఎల్లారెడ్డిలో పర్యావరణ అనుకూల సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాడిన రసాయన ఎరువులనే తరచుగా వాడి వాటి మోతాదును పెంచడం వల్ల మిగతా పోషక విలువలు పూర్తిగా తగ్గిపోతున్నాయన్నారు. దీంతో పంట భూములు నిస్సారమై పోతున్నాయని, సరైన పంట దిగుబడులు రావడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటికి భూసార పరీక్షలే చక్కటి మార్గమని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్ రెడ్డి, రిలయన్స్ సేవా సంస్థ ప్రతినిధి వినాయక్ పాల్గొన్నారు.

మా గోసను పట్టించుకునే వారు కరువయ్యారు



నిరసన దీక్షలో కూర్చున్న కాచాపూర్ గ్రామస్తులు

భిక్కనూరు: ఎంఎస్‌ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ వల్ల కలుగుతున్న ఇక్కట్ల నివారణకు చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తూ నిరసన దీక్షలు చేస్తున్నా మా గోసను పట్టించుకునే వారు కరువయ్యారు అంటూ కాచాపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నాటికి వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 37వ రోజుకు చేరుకున్నాయి. రెండు నెలలుగా ఫ్యాక్టరీ వల్ల కలిగే ఇబ్బందుల గురించి కలెక్టర్‌తో ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఎవ్వరూ సరిగా స్పందించకపోవడం చూస్తుంటే ఫ్యాక్టరీ యాజమాన్యంతో వారందరూ మిలాఖత్ అయినట్లు భావించాల్సి వస్తోందని వీడీసీ అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. కాలుష్య నియంత్రణ బోర్డుకు ఫిర్యాదు చేసినా వారు స్పందించకపోవడం శోచనీయమన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా ఊరడమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం ఊరడమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజులు నిర్వహించిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గంగామాత ఆలయంలో హోమం

భిక్కనూరు: మండల కేంద్రంలోని గంగామాత ఆలయం ఉత్సవాలు రెండు రోజులుగా గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున హోమ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

తిరుపతిలో కుప్రియాల్‌వాసుల భజన కీర్తనలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్ గ్రామానికి చెందిన కాలభైరవ భజన మండలి సభ్యులు బుధవారం తిరుపతిలో జరిగిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా భజన కీర్తనలు ఆలపించారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు చుక్కాపూర్ ఆలయంలో నర్సింహ యాగం

మాచారెడ్డి: చుక్కాపూర్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నర్సింహ ఆలయంలో గురువారం నరసింహయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభురాంచంద్రంలు బుధవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ యాగానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు కోరారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



పద్మాజీవాడి చౌరస్తా రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే జాజాల సురేందర్ తదితరులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. బుధవారం పద్మాజీవాడి చౌరస్తా వద్ద గల రైతు వేదికను పరిశీలించారు. జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 3న రైతు దినోత్సవం సందర్భంగా స్పీకర్ శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశం అనంతరం రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మడిపెద్ది కవిత, నర్సయ్య, సదాశివనగర్, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీలు కమిలి నర్సింలు, మనోహర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..



పెద్దకొడప్‌గల్:మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన మాట్లాడుతూ..ఈ ఉత్సవాలలో ప్రతి ఒక్కరు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో..



దోమకొండలో.. ఎంపీపీ కానుగంటి శారద

దోమకొండ: దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ కానుగంటి శారద అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ కౌషిక్‌రెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ : దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన కౌన్సిలర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం సంగమేశ్వర కాలనీ, చైతన్య కాలనీలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్, వైస్ చైర్మన్ జుబేర్, కౌన్సిలర్లు ఉన్నారు.

బీర్కూర్‌లో..

నస్రుల్లాబాద్(బీర్కూర్): దశాబ్ది ఉత్సవాల్లో చురుకుగా పాల్గొనాలని బీర్కూర్ ఎంపీపీ రఘు అన్నారు. బుధవారం బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో భాను ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు పల్లెలు ముస్తాబు

బాన్సువాడ రూరల్/నిజాంసాగర్: దశాబ్ది ఉత్సవాలకు పల్లెలు ముస్తాబవుతున్నాయి. ఈసారి ఉత్సవాలను ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించడంతో గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం బాన్సువాడ మండలంలో బోర్లం, బోర్లం క్యాంపు, కోనాపూర్, తాడ్కోల్, ఇబ్రహీంపేట్ తదితర గ్రామాలతో పాటు నిజాంసాగర్ మండలంలో గాలీపూర్ గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు.

కట్ట మైసమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

రాజంపేట: మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో స్థానిక ఊర చెరువు ప్రాంతంలో కట్ట మైసమ్మ గుడి నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. వచ్చే జూన్‌లో గ్రామంలో ఊరడమ్మ పండగను నిర్వహించనున్నట్లు గ్రామ ఊరడమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

భూమిపూజ చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



నిరుపేద యువతికి ఆర్థిక సాయం

భిక్కనూరు: మోటాట్‌పల్లిలో నిరుపేద యువతి శ్యామలకు రూ.15,116 ఆర్థిక సాయాన్ని సర్పంచ్ రాజేశ్వరి బుధవారం అందజేశారు. శ్యామల తండ్రి కోటయ్య మృతి చెందాడని, తల్లి లక్ష్మి దినసరి కూలీగా పనిచేస్తోందని, అందుకే శ్యామల వివాహానికి సహాయం అందజేశామన్నారు. పలువురు సర్పంచ్ దంపతులను అభినందించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

ఐకేపీ వీవోఏల సమ్మె విరమణ



మాట్లాడుతున్న సీఐటీయూ కన్వీనర్ చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నెల రోజులుగా చేపడుతున్న సమ్మెను బుధవారం ఐకేపీ వీవోఏలు తాత్కాలికంగా విరమించారు. రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్, సీఐటీయూ నాయకులతో చర్చలు జరపగా మూడు డిమాండ్‌లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. గుర్తింపు కార్డులు, యూనిఫాం, జాబ్ షాట్ డిమాండ్‌లను తక్షణమే పరిష్కరిస్తూ, మిగతా డిమాండ్లను సీఎంతో చర్చించి పరిష్కారం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు. నాయకులు శివరాం, సరిత, బాలరాజు, అనసూయ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయ అభివృద్ధికి బుధవారం భిక్కనూరుకు చెందిన పెద్దబచ్చుగారి రాంరెడ్డి రూ.2లక్షల 50 వేల విరాళం అందజేశారు. ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్‌కు ఈ మేరకు నగదును అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, భిక్కనూరు సర్పంచ్ తున్కి వేణు, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సిద్ధ రామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి శిబిరం సందర్శన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాఘవపల్లిలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని బుధవారం స్థానిక ఎంపీడీవో రఘు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు కంటి పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను వైద్య సిబ్బందిని అడిగి ఆయన తెలుసుకున్నారు. గ్రామంలో 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తికి సూచించారు. ఆయనవెంట సర్పంచ్ వెంకట్రాంరెడ్డి ఉన్నారు.

రికవరీ ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సెల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై గణేష్ బుధవారం తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన నాగరాజు ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామ శివారులో సెల్ ఫోన్‌ను పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందించారు. కార్యక్రమంలో సిబ్బంది మహేశ్, తదితరులున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

పిట్లం(జుక్కల్): కుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రయివేటు కూలీలు, గ్రామ పంచాయతీ కూలీలతో మురికి కాలువలు శుభ్రం చేయించారు.

ఘనంగా అహిల్య హోల్కర్ జయంతి



మద్నూర్(జుక్కల్): చిన్న ఎక్లార, దన్నూర్‌లలోని గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం అహిల్యాబాయి హోల్కర్ జయంతిని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రచ్చబండ వద్ద హట్కర్ సమాజ్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. చిన్న ఎక్లారలో మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, అహిల్య మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహిళ్య మాతా గొప్ప వ్యక్తి అని ఆమె బాటలో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన సూచించారు. యాదవ్‌రావ్ పాటిల్, హన్మంత్ రావ్, దేవిదాస్ పటేల్, హట్కర్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

జుక్కల్ పరిధిలో..



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం అహిల్య హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నీలుపటేల్, దాదరావ్, రాములసేట్, భానుగౌడ్ తదితరులున్నారు.